క్లుప్తంగా

నీటి నిల్వలను అరికట్టాలి

ఇచ్చోడ: మండల కేంద్రంలో పలు కాలనీల్లో రోడ్లపై నీటి నిల్వలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, పంచాయతీ అధికారులు తక్షణమే అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని వీడీసీ అధ్యక్ష, కార్యదర్శులు పేరమండ్ల నారాయణ, రేణికుంట సురేశ్‌లు కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రతి ఏటా వరద నీరు ముంచేతుందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి చేరుతుందన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

సాత్నాల: మండలంలోని కెనాల్ మెడిగూడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విశ్రాంత ఉపాధ్యాయుడు విలాస్ గౌడ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు షూ, పెన్నులు, పెన్సిళ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. త్వరలోనే నవోదయ బుక్స్ పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిలుక సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమితిని బలోపేతం చేయడమే లక్ష్యం

ఆదిలాబాద్: సనాతన హిందూ ఉత్సవ సమితిని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి అన్నారు. ఇటీవల సమితి కార్యవర్గంలో పలు మార్పులు చేయగా, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రతినిధులను జిల్లా కేంద్రంలోని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గెడం మాధవ్, పడకంటి సూర్యకాంత్, రేణిగుంట రవీందర్, కందుల రవీందర్, సామనపల్లి నర్సింలు, సంతోష్ అగర్వాల్, సుభాష్, స్వామి, సంజీవ్, సురేశ్ డోఖ్వల్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైం డీఎస్పీ హసీబుల్లా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటీజన్ కార్యాలయంలో వయోవృద్ధులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ మోసగాళ్లు రిటైర్డ్ ఉద్యోగులను టార్గెట్ చేస్తున్నారని, అపరిచిత లింక్‌లను ఓపెన్ చేయవద్దని, గుర్తు తెలియని వారికి ఓటీపీలు షేర్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో దేవిదాస్ దేశ్‌పాండే, పోశెట్టి, గంగాధర్, శంకర్, లక్ష్మారెడ్డి, సాయికిరణ్, సైబర్‌క్రైం సీఐ సురేందర్ పాల్గొన్నారు.

ఇచ్చోడలో భారీ వర్షం

ఇచ్చోడ: మండలంలో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో జనాలు బయటకు రావడానికి ఇబ్బంది పడ్డారు. పోలీస్‌స్టేషన్ ఎదుట నీరు నిలిచి చెరువును తలపించింది. ఎంప్లాయిస్ కాలనీ, టీచర్స్‌కాలనీలో వెళ్లే రోడ్లు జలమయం అయ్యాయి. ఉదయం 8 గంటల వరకు 74.06 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గాయత్రి, పెద్దగుండం జలపాతాలకు సందర్శకులు వెళ్లకుండా అటవీశాఖ అధికారి పుండలిక్ ఆదేశాలు జారీ చేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

ఇచ్చోడ: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మాట్లాడారు. గర్భిణులకు అందించే వైద్య సేవలపై పలు సూచనలు చేశారు. వార్డులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఐవో శ్రీనివాస్, వైద్యులు కిరణ్ కుమార్, మధురిమ, సిబంది పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌కు అనువైన భవనాలను గుర్తించాలి

బోథ్: మండలంలో సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం సౌర ప్యానెల్‌ల బిగించేందుకు అనువైన ప్రభుత్వ భవనాలను గుర్తించాలని బోథ్ ఎంపీడీవో రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని రైతువేదికలో విద్యుత్‌శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈనెల 17 లోపు భవనాలను గుర్తించాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగాపూర్‌కు చెందిన అర్క గంగారం (40) ఆదివారం అదృశ్యం కాగా.. బుధవారం పత్తి పంట చేనులో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఉన్నట్లు ఉట్నూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతనే మృతికి గల కారణాలు తెలుస్తాయన్నారు.

‘ఆదర్శ’ పాఠశాల

- పోటీ పరీక్షలపై ప్రత్యేక బోధన
- స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ
- ఎన్‌ఎంఎంఎస్‌లో 27 మంది విద్యార్థుల ప్రతిభ



కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడలో 2013– 14 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలో అడ్మిషన్ పొందేందుకు ఆయా విద్యా సంవత్సరంలో ఎంట్రెన్స్ టెస్టు నిర్వహించి అందులో విద్యార్థులు కనబర్చిన ప్రతిభను బట్టి 6వ తరగతిలో ప్రవేశం కోసం అవకాశం కల్పిస్తారు. ఈ ఆదర్శ పాఠశాలలో అక్కడి ఉపాధ్యాయులు కార్పొరేట్‌కు దీటుగా విద్యబోధన చేస్తున్నారు. ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులు జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయి ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీట్లు సాధిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి వరకు చదివిన అనంతరం వారి పిల్లలను 6వ తరగతిలో బంగారుగూడ ఆదర్శ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ప్రతీ విద్యా సంవత్సరం అడ్మిషన్‌లకు తీవ్ర పోటీ నెలకొంటుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు పేర్కొంటున్నారు.

ప్రత్యేక బోధన..

మండలంలోని బంగారుగూడ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు విద్యా బోధన చేసే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం ఇక్కడ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 500 మందికి 507 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడి జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు ఉన్నాయి. అయితే ఆయా కోర్సులు చదువుతున్న వారికి అక్కడే వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు చదువుతున్న విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్ వంటి సబ్జెక్టులకు ప్రత్యేకమైన తరగతులు తీసుకుంటున్నారు. అంతేకాకుండా ఫిజిక్స్ వాలా, ఖాన్ వంటి వాటి ద్వారా డిజిటల్ విద్యాబోధన చేస్తున్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు చదువుకునే విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్, తదితర పోటీ పరీక్షలకు సంబంధించి ప్రైవేట్‌కు దీటుగా కార్పొరేట్ స్థాయిలో విద్యా బోధన చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అంతేకాకుండా కంప్యూటర్ పరిజ్ఞానం అందించేందుకు అక్కడ ప్రత్యేకమైన కంప్యూటర్ ల్యాబ్ అందుబాటులో ఉంది. ఒక్కొక్క బ్యాచ్‌కు 60 మంది విద్యార్థులకు శిక్షణను అందజేస్తున్నారు.

మార్కెటింగ్‌పై శిక్షణ..

ఆదర్శ పాఠశాల, కళాశాలలో ప్రత్యేకంగా షాప్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ చదువుకుంటున్న 9వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ విద్యార్థులకు రిటైల్ మార్కెటింగ్ రంగంపై స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను అందజేస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థులకు క్షేత్రస్థాయి పర్యటనను సైతం తీసుకెళ్లడం జరుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న విద్యార్థులకు ప్రభుత్వం సర్టిఫికెట్ సైతం అందజేయడం జరుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. భవిష్యత్‌లో ఏదైనా షాప్‌లో ఉద్యోగం చేసి ఉపాధి పొందేందుకు ఆస్కారం ఉంటుందని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు.

సీటు సాధించా..



ఐదో తరగతి వరకు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుకున్నా. బంగారుగూడ ఆదర్శ పాఠశాలలో చేరేందుకు ఎంట్రెన్స్ రాశాను. ప్రతిభ కనబర్చడంతో 6వ తరగతిలో అడ్మిషన్ తీసుకున్నా. ఇక్కడ విద్యాబోధన అన్ని మిగతా పాఠశాలల కంటే బాగుంది.

– అగస్త్యే, 10వ తరగతి విద్యార్థి

కార్పొరేట్‌కు దీటుగా..



నాది ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవేనగర్ కాలనీ. ఆదర్శ పాఠశాల, కళాశాలలో వివిధ పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణను అందజేస్తున్నారు. అంతేకాకుండా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను సైతం అందజేస్తున్నారు. ప్రైవేట్‌కు దీటుగా కార్పొరేట్ స్థాయిలో శిక్షణ ఇస్తున్నారు.

– శ్వేత, ఇంటర్మీడియేట్, సెకండ్ ఇయర్

అడ్మిషన్లకు పోటీ



తమ పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థులు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ప్రతీ విద్యా సంవత్సరం అడ్మిషన్‌లు పొందేందుకు తీవ్రమైన పోటీ ఉంటుంది. ఉపాధ్యాయుల సహకారంతో ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.

– రాజశేఖర్, ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల, కళాశాల, బంగారుగూడ

ప్రత్యేక చొరవ



తమ పాఠశాల, కళాశాలలో అనుభవజ్ఞులైన రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారు. పాఠశాల, కళాశాల అభివృద్ధికి తమ ప్రిన్సిపాల్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. వారికి కూడా ఉపాధ్యాయుల పూర్తి సహకారం ఉంటుంది.

– చిందం ఆశన్న, ఉపాధ్యాయుడు, బంగారు

కేజీబీవీలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నేరడిగొండ: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో బుధవారం సీబీపీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది విద్యార్థినుల రక్త నమూనాలు సేకరించారు. ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు స్వప్న మాట్లాడుతూ.. విద్యార్థినులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించారు. కేజీబీవీ హాస్టల్ ప్రిన్సిపాల్ ఎల్.రజిత, హెచ్‌ఈవోవో పవార్ రవీందర్, స్వర్ణలత, ఫార్మసిస్ట్ ఓంప్రకాశ్, ఏఎన్‌ఎంలు అమ్మిబాయి, సుజాత, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

బోథ్: మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో సామాజిక సేవకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల ఉమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై శ్రీసాయిలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 130 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. చట్ల ఉమేష్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, అల్లకొండ పోతన్న, అబ్రార్ పాల్గొన్నారు.

వరద ఉధృతి పరిశీలన

బేల: మండలంలోని పెన్‌గంగ పరివాహక ప్రాంతమైన దహెగాం రెవెన్యూ గ్రామ శివారులోని లోలెవల్ వంతెనపై నుంచి ప్రవాహిస్తున్న వరద ఉధృతిని బుధవారం తహసీల్దార్ రఘునాథ్‌రావు పరిశీలించారు. వంతెన వద్ద పేరుకుపోయిన చెత్త చెదారాన్ని జేసీబీతో తీయించారు. భారీ వర్షాల దృష్ట్యా లోలెవల్ వంతెనలను, కల్వర్టులను దాటవద్దన్నారు. ఆయన వెంట ఎస్సై మహేందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎండీ సాజిద్, సిబ్బంది ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో ఆదిలాబద్ ఉమ్మడి జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎంపీ, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. రైతులు విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు.

ఆదిలాబాద్: రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రకటనలో కోరారు. ప్రజలు, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని సూచించారు. అత్యవసరం అయితే తప్పా బయటకు రాకూడదన్నారు. బీజేపీ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

కైలాస్‌నగర్: భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదమున్నందున, ఎవరూ దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు.

ఇంద్రవెల్లి: ప్రజలను అప్రమత్తం ఉండాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీవో జీవన్‌రెడ్డిలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటకు రాకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జాదవ్ శ్రీనివాస్, మేజర్ గ్రామ పంచాయతీ ఈవో సంజీవ్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నందున మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని ఎస్సై సంజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామస్తులు బండ్రేవ్ వాగు దాటకుండా పోలీసు సిబ్బంది ప్రకాష్, శేఖర్ పహారా కాశారు.

టు టౌన్ సీఐగా నాగరాజు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ టు టౌన్ సీఐగా నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను పోలీస్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఇది వరకు సీఐగా పనిచేసిన సీహెచ్ కరుణాకర్ రావు భూపాలపల్లి జిల్లా స్టేషన్ ఘనపూర్‌కు బదిలీపై వెళ్లారు. మెదక్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఈయన జిల్లాకు బదిలీపై వచ్చారు.

వ్యాక్సిన్ వేయించాలి

ఆదిలాబాద్‌టౌన్: పిల్లలకు తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం శాంతినగర్ అర్బన్ పీహెచ్‌సీలో జాతీయ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు 11 రకాల వ్యాక్సిన్‌లను వేయడం ద్వారా వ్యాధులు రాకుండా ఉంటుందన్నారు. పోలియో, హైపటిస్, తట్టు, రొటొబిల్లా, తదితర వ్యాధులు రాకుండా ప్రభుత్వం ఉచితంగా టీకాలను వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 16 సంవత్సరాల వయస్సు గల వారికి టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, వైద్యురాలు ఇఫ్రత్, లక్ష్మి, సాయి, మౌనిక, విజయశాంతి పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

తాంసి: ఈనెల 20 నుంచి 22 వరకు మేడ్చల్‌లో నిర్వహించే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించారు. ప్రజల పక్షాన ఉంటూ సమస్యలు పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అర్ధాంగి రమేశ్, జింక సతీష్, రాము, కార్తీక్, సుధీర్, సాయి, అరవింద్, కళ్యాణ్ పవన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సభ..

ఇంద్రవెల్లి: అసరా పింఛన్ పెంచాలని ఈనెల 22న కడెం మండల కేంద్రంలో నిర్వహించే మందకృష్ణ మాదిగ సభకు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి రేనికుంట్ల సాగర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నాయకులతో సమావేశమయ్యారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నాలుగు వేలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, ఎనుగంటి అన్వేష్, లింగంపల్లి రాజన్న, నర్సయ్య, రొడ్డ జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం పెంచేందుకు కృషి



సభ్యత్వం నమోదు చేస్తున్న సీఈవో అడే గణేశ్

నార్నూర్: రైతుల ఆదాయం పెంచేందుకు కృషి చేస్తామని పీఏసీఎస్ సీఈవో అడే గణేశ్ అన్నారు. బుధవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘంలో రైతులు సభ్యత్వం నమోదు చేసుకుంటే వారికి వ్యవసాయానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎఫ్‌పీవో ద్వారా రైతులు కలిసికట్టుగా తమ పంట ఉత్పత్తులను విక్రయించవచ్చాన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు తక్కువ ధరకే పొందవచ్చాన్నారు. సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, రుణ సదుపాయం ఉంటుందన్నారు.

విద్యార్థులు మత్తుకు బానిస కావద్దు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తాంసి: విద్యార్థులు మత్తుకు బానిస కావద్దని తాంసి కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సంతోశ్ అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నషా ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులతో యాంటీ డ్రగ్స్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు దేవేందర్, తిరుపతి రెడ్డి, రమణరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను నిరోధిస్తాం

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, మద్యం మత్తులో చిక్కి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సాయిప్రసాద్, నర్సింగ్ రావు, రవీందర్, ధన్‌రాజ్, గణేశ సుజాత పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆదిలాబాద్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం అన్నారు. బుధవారం కళాశాలలో మత్తు పానీయాలు, గంజాయి, డ్రగ్స్ వాడకంతో జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యాంటీడ్రగ్ కోఆర్డినేటర్ కోటయ్య, అనిత, రేఖ, స్వప్న, ముబారక్, నరేశ్ పాల్గొన్నారు.

వాగు దాటి వైద్యసేవలు అందించి...



బోథ్: వాగు దాటుతున్న వైద్య సిబ్బంది



ఇచ్చోడ: వాగుదాటి వెళ్తున్న వైద్య సిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని నర్సాపూర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది రాథోడ్ కృష్ణ, రేణుక బుధవారం వాగు దాటి నారాయణపూర్ గ్రామానికి వెళ్లి వైద్యసేవలు అందించారు. బుధవారం ఉదయం నుంచి వర్షం ఏకదాటిగా కురవడంతో వాగు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో కాలినడకన గ్రామానికి వెళ్లి గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

బోథ్: సొనాల పీహెచ్‌సీ సిబ్బంది బుధవారం కోటకె గ్రామానికి వెళ్లేందుకు వాగు దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కిలోమీటరు దూరం వరకు కాలినడకన వెళ్లి మధ్యలో ఉన్న వాగును దాటి గ్రామానికి వెళ్లి వైద్యసేవలు అందించారు. గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ యాళ్ళ లింగారెడ్డి, ఏఎన్‌ఎంలు జమున, పరిపూర్ణ, ఆశా కార్యకర్త భాలాబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

జైనథ్: ఎమ్మెల్యే సహకారంతో మండలంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ప్రతాప్ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలు అందజేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఇందిరమ్మ పథకాలతో అర్హులైన వారందరికీ ఇండ్లు నిర్మించే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.

సంక్షిప్తం..

ఘనంగా భగవాన్‌బాబా జయంతి

ఇంద్రవెల్లి: వంజరి సమాజ్ కుల గురువు శ్రీసంత్ భగవాన్‌బాబా 129వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలో భగవాన్‌బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీసంత్ భగవాన్‌బాబా చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపటేల్ మారుతి డొంగ్రె, ఫడ్ విశ్వనాథ్, మారుతి మహరాజ్, కేశవ్ ముస్లే, ముండే బాబు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసులు అందజేత

బోథ్: మండల కేంద్రములోని హనుమాన్‌వాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజని బుధవారం తన కుమారుడు లలిత్ రాజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాలలోని విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఉట్నూర్‌రూరల్: పలు సమస్యలపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును మాదిగ కుల సంఘం అధ్యక్షుడు కొల్లూరు లింగన్న ఆధ్వర్యంలో కుల సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. మాదిగలకు కమ్యూనిటీ హాల్, శ్మశానవాటిక, దళిత విద్యార్థులులకు పోస్టుమెట్రిక్ హాస్టల్, రాజీవ్ యువ వికాసంలో ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరావు, గుడిసెల సలోమోన్, వేల్పుల జైరాజ్, నాతరి పోషన్న, కొల్లూరి స్వామి, నాతారి రాజు, కొమ్ము రవి, గుడిసెల మహేశ్ పాల్గొన్నారు.

వేదిక నిర్మాణం

సిరికొండ: మండలంలోని రిమ్మ గిరిజన ఆశ్రమ పాఠశాల్లో విద్యార్థుల కోసం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పెందుర్ అనిల్ కుమార్ సొంత ఖర్చుతో వేదిక నిర్మించారు. బుధవారం తహసీల్దార్ తుకారం, ఎంపీడీవో రవీందర్‌లు ప్రారంభించారు.

వాలీబాల్ కిట్స్ అందజేత

బజార్‌హత్నూర్: మండలంలోని గులాబ్‌తండా, మోర్కండి గ్రామాల్లో బుధవారం యువజన సంఘాలకు పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్స్ అందజేశారు. వీపీవో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ యువత చట్టాలను గౌరవించి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బాజీసింగ్, ప్రభు, దినేష్, సత్యపాల్, మారుతి, సంతోష్, రాజు పాల్గొన్నారు.

పాఠశాలలో వృక్షాబంధన్

తలమడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల విద్యాధికారి వెంకట్‌రావు మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, చంద్రమ్మ, రాకేశ్ పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ సెక్రెటరీగా నానిరెడ్డి

నేరడిగొండ: నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా కమిటీ సెక్రెటరీగా తేజాపూర్ గ్రామానికి చెందిన యువ సామాజిక సేవకుడు సుశ్రుత్ రెడ్డి (నానిరెడ్డి) నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడు బద్దం పురుషోత్తం రెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం అయ్యేలా చూడాలి

భీంపూర్: గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం అయ్యేలా చూడాలని మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ అన్నారు. మండలంలోని టేకిడి రాంపూర్ గ్రామానికి చెందిన గర్భిణి ప్రసవం నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చుకున్నట్లు తెలిపారు. అనంతరం మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆరోగ్య కార్యకర్త గోదావరి, ఆశ కార్యకర్త సంగీత, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిహత్నూర్‌ను సందర్శించిన ట్రెయినీ కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ గ్రామాన్ని ట్రెయినీ కలెక్టర్ సలోనిచాబ్రా బుధవారం సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. రికార్డుల వివరాలను పంచాయతీ కార్యదర్శి శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పనితీరు చాలా బాగున్నాయన్నారు.